క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యం



మొక్కలు నాటే పనిలో 'జియో' సభ్యులు

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యమని జియో వ్యవస్థాపకులు రామకృష్ణ అన్నారు. పట్టణంలోని బెహరా చెరువు తూర్పు గట్టున జియో సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ సనాతన ధర్మంలో భాగమని అన్నారు. సముద్రాలు, నదులు, పర్వతాలు, వృక్షాలు, నవగ్రహాలను దేవతలుగా ఆరాధించేవారని చెప్పారు. కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ విజయలక్ష్మి, సభ్యులు వి.నాగేశ్వరరావు, ఐ.కోటేశ్వరరావు, ఏ.శ్రీను, కె.కుమార్, మోక్షి త్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఐ మహేష్

బొండపల్లి: సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాలు, పొట్టేళ్ల పందాలు,పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ యు.మహేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పండగ చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న యోగా శిక్షకులు వంశీకిరణ్

బొండపల్లి: రోజూ యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మానసిక ప్రశాంతత పొందవచ్చని యోగా శిక్షకులు బీమనేని వంశీ కిరణ్ అన్నారు. గొట్లాం గ్రామంలోని పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో యోగా, ధ్యానంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనవుతున్నారని, ఒత్తిడిని అధిగమించేందుకు రోజూ కొంత సమయాన్ని యోగా, ధ్యానం చేసేందుకు కేటాయించాలని చెప్పారు.యోగా శిక్షకులు దాట్ల రాయ్, జగపతిరాజు, పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ జయంతి

దత్తిరాజేరు: మండలంలోని వంగర కూడలి వద్ద పెదమానాపురం ఎస్ఐ జయంతి పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు నిర్వ హించారు. వాహన పత్రాలు, వాహన చోదకుల లైసెన్స్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు విధి గా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. తప్పనిసరిగా వాహన పత్రాలు, లైసెన్స్ ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

బొంతల కోటికి సన్మానం


బొంతలకోటిని సన్మానిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: విద్యారంగంలో వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఉపాధ్యాయుడు బొంతల కోటి శంకరరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రం విజయనగరంలో ఆదివారం ఉపాధ్యాయుడు బొంతలకోటిని మంత్రి సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు, ఐక్యరాజ్య సమితి అవార్డులు సాధించడంతో పాటు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కడం అభినందనీయమని మంత్రి శ్రీనివాస్ కొనియాడారు.

మామిడిని ముంచుతున్న మంచు

- పొగ మంచు ప్రభావంతో మాడిపోతున్న పూత
- పంటను ఆశిస్తున్న తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్లు
- ఆందోళనలో రైతులు

ఎస్.కోట నియోజకవర్గంలో మామిడి తోటల సాగు వివరాలు

మండలం	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)
ఎస్.కోట	1,048
వేపాడ	2,230
ఎల్.కోట	2,772.50
కొత్తవలస	610
జామి	3,355


జామి మండలంలోని అలమండలో మామిడి తోటను పరిశీలించి రైతుకు సూచనలు చేస్తున్న హెచ్ఓ అనిత

లక్కవరపుకోట: కొద్దిరోజులుగా దట్టంగా కురుస్తున్న పొగమంచు మామిడిని ముంచుతోంది. ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు కురుస్తునే ఉండడంతో మామిడి పూత మాడిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో రైతులు పదివేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అంతగా అనుకూలించకపోవడంతో మామిడితోటల్లో పూత ఆలస్యం గా వచ్చింది. అరకొరగా వచ్చిన పూత కూడా రాలిపోతోందని రైతులు గగ్గోలు పెడుతు న్నారు. అల్పపీడనం ప్రభావంతో డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలు మామిడి పంటకు నష్టం కలిగించాయి. వర్షాల వల్ల పూత రాకపోగా ముందే అక్కడక్కడా అరకొరగా వచ్చిన పూత సైతం ఇప్పుడు రాలిపోతుండడంతో పాటు ఆకులు నల్లగా మాడిపోతున్నాయి. వర్షాల వల్ల జరిగిన నష్టం నుంచి పంట తేరుకుంటుందనుకునే సమయంలో మంచు రూపంలో మళ్లీ పంటకు నష్టం కలుగుతోంది. పొగ మంచు వల్ల పంటను తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్లు ఆశిస్తున్నాయి.


తేనె మంచుకారణంగా ఎల్.కోట మండలం భీమాళి ప్రాంతంలో రాలిపోతున్న మామిడిపూత


లక్కవరపరకోట మండలం శ్రీరాంపురంలో మామిడి తోట


ఎల్.కోట మండలంలోని శ్రీరాంపురంలో కురుస్తున్న మంచు

సస్యరక్షణ చర్యలు పాటించాలి



మామిడి సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపడితే అధిక లాభాలు పొందవచ్చు. తేనె మంచు పురుగు వల్ల పూతరాలిపోయే అవకాశం ఉంటుంది. నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణాన్ని, లేదా క్లోరీఫైరిపాస్ రెండు మిల్లీలీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. పొటాష్ లోపంతో కూడా పూత రాలిపోయే అవకాశం ఉంది. 5 గ్రాముల పొటాషియం నైట్రేటును లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరానికి, 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకుంటే పూత నిలవడంతో పాటు నాణ్యత పెరుగుతుంది. సాగులో శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలి.

– టి.అనిత, ఉద్యానవనశాఖ అధికారి, శృంగవరపుకోట

• సత్యం సంతాప సభ


సంతాప సభకు హాజరైన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

చీపురుపల్లి: ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ మామ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తండ్రి, రామలింగాపురం సర్పంచ్ నారాయణమ్మ భర్త సత్యం సంతాప సభను రామలింగాపురంలో ఆదివారం నిర్వహించారు.శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ హాజరై ఇప్పిలి సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివా సరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెలిమర్ల, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యేలు బడుకొండ అప్పలనాయుడు, గొర్లె కిరణ్‌కుమార్, రాజాం నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు హాజరై నివాళి అర్పించారు.

గ్రంథాలయ సేవా సంఘం కన్వీనర్ల నియామకం


కన్వీనర్, కో–కన్వీనర్‌కు నియామకపత్రాలు అందజేస్తున్న అబ్దుల్ రవూఫ్

చీపురుపల్లి: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో పని చేసేందుకు చీపురుపల్లి మండలానికి కన్వీనర్, కో–కన్వీనర్ల నియామ కాలను ఆ సంఘం చేపట్టింది. మండల గ్రంథాలయ సేవా సంఘం కన్వీనర్‌గా పట్టణానికి చెందిన మీసాల లక్ష్మణరావు, కో–కన్వీనర్‌గా మెట్టపల్లి గ్రామానికి చెందిన ఉజూరు హరిని నియమిస్తూ ఆసంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ ఆదివారం నియామకపత్రాలు అందజేశారు. మండల సంఘానికి సంబంధించిన మిగిలిన సభ్యులను నియమించుకోవాలని కన్వీనర్, కో–కన్వీనర్‌కి సూచించారు. అలాగే మండలాల్లో విరివిగా గ్రంథాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు పాఠకుల సంఖ్యను పెంచడం, పుస్తక పఠనంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని వారికి దిశానిర్దేశం చేశారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


వెంకటరమణపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

శృంగవరపుకోట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కించపరిచేలా పార్లమెంట్‌లో మాట్లాడిని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ను తక్షణం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వెంకటరమణపేట ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు మాట్లాడుతూ దేశ సమైక్యత వెల్లివిరిసేలా రాజ్యాంగ రచన చేసి, అన్ని మతాలు, వర్గా ల వారి అభివృద్ధికి పాటుపడి న అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు. కేంద్ర ప్రభు త్వం హిందుత్వ ముసుగు వేసుకుని విద్వేషాలకు ఆజ్యం పోస్తోందని అన్నారు. దేశంలో కొన్ని వర్గాలు, మహిళలపై జరుగుతున్న దాడులు, దమనకాండలపై కేంద్రం శీత కన్ను వేస్తోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం తీరును ప్రజలకు తెలియజేసేలా ము ద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. లోతేటి చంద్రావతి, బి.జగ్గారావు, ఎం.అప్పలకొండ, ఎం.అప్పలరమణ, ఎం.గోపి, ఈ.మంగ, కె.ప్రసాద్, జి.పెంటయ్య, జి.మహేష్, డి.గంగమ్మ, ఎం.అబద్దం, ఆర్.సూరిబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీలర్ పోస్టులకు రాత పరీక్ష


పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

చీపురుపల్లి: చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుల నియామకానికి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుల భర్తీకి పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్డీఓ జి.వి.సత్యవాణి పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెవెన్యూ డివిజన్ పరిధిలో 26 పోస్టులు ఖాళీ ఉండగా 59 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాత పరీక్షకు 51 మంది హాజరయ్యారు. ఈపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈనెల 9న స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి 10న నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ఆర్డీఓ సత్యవాణి తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన


విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అతిథులు, అవంతి కళాశాల అధ్యాపకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ జాషువా జయప్రసాద్ తెలిపారు. చీపురుపల్లి,గరివిడి, మెరకముడిదాం,గుర్ల, లావేరు, నెల్లి మర్ల మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 1078 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థిని వలిరెడ్డి జ్యోత్స్న ప్రథమ స్థానంలో నిలిచింది. గరివిడి గోదావరి దేవి షరాఫ్ స్కూల్ విద్యార్థి శివశ్యామ్ ద్వితీయస్థానం, చీపురుపల్లి మండలంలోని పెద్దనడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని హరిణి తృతీయస్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.7వేలు, తృతీయస్థానంలో నిలిచిన వారికి రూ.3వేల నగదు బహుమతులు అందజేశారు. ఎంఈఓ పి.రామారావు, ఎమ్ఆర్ఏజీఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ జి.భారతి, చీపురుపల్లి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ జి.స్వామినాయుడు, అవంతి విద్యా సంస్థల ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్ ,వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


కార్మికులకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: వేతన ఒప్పందం కోసం వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చెప్పారు. కర్లాం వద్ద పౌల్ట్రీ పరిశ్రమ ఎదుట కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మె శిబిరం వద్దకు ఆదివారం ఆయన వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ నుంచి న్యాయబద్ధంగా రావాల్సిన హక్కులు సాధించుకోవడం కోసం కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇక్కడ పరిశ్రమలో కార్మికులకు రావాల్సిన అన్ని సదుపాయాలను యాజమాన్యంతో మాట్లాడి ఇప్పించామన్నారు. 2023–24 సంవత్సరంలో సంక్రాంతికి బోనస్‌తో పాటు వేతన ఒప్పందం కూడా జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. ఈనెల 7న జిల్లా కార్మికశాఖ వద్ద జరగనున్న చర్చల్లో సమస్య పరిష్కారం కాకపోతే పోరాటం ఉధృతం చేయాలని కార్మికులకు సూచించారు. పోరాటంలో అధికార పార్టీతో పాటు అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలను కలుపుకుని వెళ్లాలని కార్మికులకు సూచించారు. సీఐటీయూ నాయకులు టి.వి.రమణ, ఏ.గౌరునాయుడు, కార్మిక సంఘ నాయకులు గురునాయుడు, ఈశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడుతున్న జాతీయ రహదారి

- పోలిపల్లి రహదారిపై వరుస ప్రమాదాలు
- నెల రోజుల వ్యవధిలో ఆరుగురు మృత్యువాత
- జాతీయ రహదారి డిజైన్ లోపమే కారణమంటున్న వాహన చోదకులు
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి


పోలిపల్లి వద్ద జాతీయ రహదారి

పూసపాటిరేగ: జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాలను కలుపుతూ వెళ్తున్న చైన్నై – కోల్‌కత్తా జాతీయ రహదారిపై భోగాపురం మండలం పోలిపల్లి సమీపంలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. పోలిపల్లి ఫ్లై ఓవర్ వద్ద గల పెట్రోల్‌బంక్ సమీపంలో వరుస ప్రమాదాలు జరగడంతో సమీప గ్రామాలు ప్రజలు హడలెత్తిపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో భోగాపురం మండలంలో జరిగిన ప్రమదాలలో 10 మంది మృత్యవాత పడగా, పోలిపల్లి వద్దే ఆరుగురు కన్నుమూశారు. పోలిపల్లి ఫ్లై ఓవర్ సమీపంలో రహదారి డిజైన్ లోపం కారణంగానే వరుస ప్రమదాలు జరుగుతున్నట్లు పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. 2024 నవంబర్ 30న పోలిపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో శ్రీకాకుళంనకు చెందిన దబిడి కౌశిక్‌రెడ్డి, వద్దే అభినవ్, వద్దే మణిమాల, జయేష్‌లు మృతి చెందారు. డిసెంబరు 26న అదే ప్రదేశంలో జరిగిన కారు ప్రమాదంలో తమిళనాడు మీనంబాకంకు చెందిన భార్యాభర్తలు నాగిరెడ్డి యాదుకుమార్, నాగిరెడ్డి సాయిలీల మృతి చెందారు. అలాగే నవంబర్ 9న నారుపేట సమీపంలో జరిగిన ప్రమాదంలో షేక్ అరీఫ్ మృతి చెందారు. భోగాపురం నుంచి రాజాపులోవ వరకు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే నిర్వహణకు లక్షలాది రుపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రమాదాలు తగ్గడం లేదు. హైవేలో డిజైన్ లోపమా.. లేదా వాహనదారుల నిర్లక్ష్యమో తెలియడం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



పోలిపల్లి సమీపంలో వరుస ప్రమాదాలు జరగడం వాస్తవమే. పోలిపల్లి వద్ద ప్రమాదాలు జరగడానికి గల కారణాలపై ఇప్పటికే హైవే అధికారులు, రవాణాశాఖ అధికారులకు తెలియజేశాం. ఫ్లై ఓవర్ దిగిన వెంటనే మలుపు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒకే ప్రదేశంలో రెండు ప్రమాదాలు జరిగాయి. కారణాలపై పూర్తిస్థాయిలో హైవే ఇంజినీరింగ్ అధికారులు పరిశీలన చేసి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలి.

ఎస్. ప్రభాకర్, సీఐ భోగాపురం.


పోలిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో సంఘటనా స్థలంలో మృతదేహాలు (ఫైల్)


పోలిపల్లి వద్ద నలుగురిని బలిగొన్న ప్రమాదం (ఫైల్)

భగవద్గీత పుస్తకాల పంపిణీ


భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న మోక్షవిద్య యోగమందిర్ సభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఆకులడిపో ప్రాంతంలో స్థానిక మోక్షవిద్యయోగమందిర్ సభ్యులు ఆదివారం ఇంటింటికీ భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మోక్షవిద్యయోగమందిర్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని సూచించారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి


తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేపాడ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆరేళ్ల వచ్చే వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని వల్లంపూడిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. వల్లంపూడిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి ఒకే చోట ఆదివారం ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్)డే నిర్వహించారు. తల్లులకు పిల్లల సంరక్షణ, వారికి అందించాల్సిన పౌష్టికాహారం తదితర అంశాలపై తల్లులకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, లత, ఈశ్వరమ్మ అవగాహన కల్పించారు.

శిక్షణ పొందుతున్న యువతకు పౌష్టికాహారం


యువతకు పౌష్టికాహారం అందిస్తున్న గోవిందరాజులు

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శిక్షణ పొందుతున్న యువతకు పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ ఉద్యోగాలకు, ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత రోజూ ఇక్కడ మైదానంలో శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం యువతకు గుడ్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పేద కుటుంబాలకు చెందిన యువత ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారని, వారికి దాతలు సహాయం అందించి సహకరించాలని కోరారు. యల్లంటి లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.